మార్పు కోసం...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి కేంద్రాలుగా నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న) తెలుగు దినపత్రికకు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంప్రదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 209 19 శుక్రవారం, జనవరి 2024 పేజీలు: 4/వెల రూ5/-

## శ్రీరామ జన్మభూమి పై స్మారక పోస్టల్ స్టాంప్ విడుదల చేసిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జనవరి18(మరో ఉదయం):



రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠకు ముందుగా గురువారం శ్రీరామ జన్మభూమి ఆలయంపై స్మారక పోస్టల్ స్టాంప్‌ను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. దీనితో పాటు రాముని చిత్రంతో కూడిన స్టాంపుల పుస్తకాన్ని కూడా ప్రధాని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేశారు. ఈ 48 పేజీల పుస్తకంలో 20 దేశాల స్టాంపులు ఉన్నాయి. రామాలయ పోస్టల్ స్టాంపు విడుదల అనంతరం ప్రధాని మోదీ ఓ వీడియో సందేశాన్ని కూడా విడుదల చేశారు. ప్రధాని మోదీ మొత్తం 6 తపాలా స్టాంపులను విడుదల చేశారు. వీటిలో రామాలయం, గణేశుడు, హనుమంతుడు, జటాయువు, శబరి మొదలైనవి ఉన్నాయి. ఈ 48 పేజీల పుస్తకంలో అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, కెనడా, కంబోడియా, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు సహా 20కి మించిన దేశాలు విడుదల చేసిన పోస్టల్ స్టాంపులు ఉన్నాయి.

## తెలుగువారి దమ్ము ధైర్యం ఎన్టీఆర్

### నివాళి అర్పించిన బాలకృష్ణ

హైదరాబాద్,జనవరి18(మరో ఉదయం):



తెలుగువారి దమ్ము, ధైర్యం ఎన్టీఆర్ అని కుమారుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్‌కు మరణం లేదని, ప్రజల హృదయాల్లో చిరకాలం సజీవంగా ఉన్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద బాలకృష్ణ తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ..ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు చిరస్థాయిగా నిలచిపోతాయని తెలిపారు. ఎన్టీఆర్ అమలు చేసిన పథకాలను మిగతా రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయని వివరించారు. పేదవారి ఆకలిని ఎన్టీఆర్ తీర్చారని గుర్తుచేశారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కును ఎన్టీఆర్ కల్పించారని బాలకృష్ణ తెలిపారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారని పేర్కొన్నారు. కొందరు ఎన్టీఆర్‌ను దైవంగా చూస్తారని బాలకృష్ణ పేర్కొన్నారు. ఎన్టీఆర్ నడిచిన మార్గం స్ఫూర్తిదాయకం అని వివరించారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో టీడీపీ కార్యకర్తలు నడవాలని బాలకృష్ణ కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొస్తాం అని బాలకృష్ణ వెల్లడించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, దివంగత నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. కుమారుడు బాలకృష్ణ, మనమళ్లు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, మనమరాలు అలేఖ్య రెడ్డి అంజలి ఘటించారు.

## 30కోట్ల మందిని విమానయనాన్నికి చేరువ చేసే లక్ష్యం

### విమానయాన రంగంలో ఎన్నో అవకాశాలు
### వింగ్స్ ఇండియాతో దేశ పౌరవిమానయాన ఘనత
### కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి

హైదరాబాద్,జనవరి18(మరో ఉదయం):




2 లో

## టాటా గ్రూపుతో స్కిల్ సెంటర్లపై ఒప్పందం

### రైతులకు కార్పొరేట్ తరహాలో లాభాలు
### ఇదే తన స్వప్నమన్న సిఎం రేవంత్
### దావోస్ సదస్సులో మాట్లాడిని సిఎం

హైదరాబాద్,జనవరి18(మరో ఉదయం):

2 లో



## గజ్వేల్‌లో కెసిఆర్‌ను ఓడించేందుకు కుట్ర

### కాంగ్రెస్, బిజెపిలు పోటీపోటీగా కుట్రలు
### అయినా ప్రజలు కెసిఆర్ వెంటే నడిచారు
### గజ్వేల్ బిఆర్ఎస్ కృతజ్ఞతా సభలో హరీష్ రావు

గజ్వేల్,జనవరి18(మరో ఉదయం):



2 లో

## ఆరు నెల్లో కాంగ్రెస్‌పై ప్రజా తిరుగుబాటు

### ఆదానీని దొంగ అంటూనే
### అలయ్ బలయ్
### పార్లమెంట్ ఎన్నికలకు
### సన్నద్ధంగా ఉండాలి
### ఎమ్మెల్సీలకు కెటిఆర్ పిలుపు

హైదరాబాద్,జనవరి18(మరో ఉదయం)



ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఎన్నికల ముందు అదానీ దొంగ అని విమర్శించిన రేవంత్ రెడ్డి.. సీఎం అయ్యాక దావోస్ సాక్షిగా అదానీతో అలయ్-బలయ్ చేసుకున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ- అదానీ ఒకటేనని రాహుల్ అంటున్నారని.. మొన్న రేవంత్ కూడా అదానీ-మోదీ ఒకటేనని విమర్శించారని గుర్తు చేశారు. ఢిల్లీలో అదానీతో కొట్లాడుతూ తెలంగాణలో మాత్రం అదానీతో కలిసి ఎందుకు పనిచేస్తున్నారో చెప్పాలని రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ఏడాదిలో వరుసగా వివిధ ఎన్నికలు ఉన్నాయని.. వీటిని ఎదుర్కోవడం కోసం పార్టీ సంసిద్ధంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గురువారం పార్టీ ఎమ్మెల్సీలతో సమావేశం అయిన ఆయన.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉండే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు అవకాశాలు బలంగా ఉన్నాయని నమ్మకం వెలిబుచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్సీలు విస్తృతంగా పని చేయాలని కోరారు. జిల్లా కేంద్రంగా పార్టీ కార్య క్రమాలను మరింత యాక్టివేట్ చేస్తా మన్నారు. త్వర లోనే మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలతో సమావేశం ఉంటుందని.. అందు లోనే శాసన మండలి పార్టీ నేతను ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలు కోసం శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఒత్తిడి కొనసాగిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్‌కు గుర్తు చేస్తామన్నారు. హామీలను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తే.. అసెంబ్లీలో ఉన్న బలమైన ప్రతిపక్షాలు శాసనసభ వేదికగా ప్రశ్నిస్తాయని హెచ్చరించారు. చురుకైన నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ ఉపయోగించు కుంటుందని కేటీఆర్‌చెప్పు కొచ్చారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. సభకు మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, కడియం శ్రీహరి, మాజీ స్పీకర్‌లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, ఎంపీ మన్నె

## ఏపీ పీసీసీ చీఫ్ గా షర్మిల బాధ్యతల స్వీకరణకు ముహూర్తం ఖరారు

### ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల నియామకం
### ఈ నెల 21న పదవీ బాధ్యతల స్వీకరణ
### విజయవాడ ఆంధ్రరత్న భవన్ లో కార్యక్రమం



వైఎస్ షర్మిల ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా నియమితురాలైన సంగతి తెలిసిందే. ఆమె ఈ నెల 21న రాష్ట్ర కాంగ్రెస్ నూతన అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టనున్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ (రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం)లో ఆదివారం ఉదయం 11 గంటలకు షర్మిల బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడేళ్ల కిందట తెలంగాణలో పార్టీ పెట్టిన వైఎస్ షర్మిల ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మద్దతు పలికి పోటీకి దూరంగా ఉన్నారు. అనంతరం కాంగ్రెస్ లో చేరి తన పార్టీని కూడా విలీనం చేశారు. అందుకు ప్రతిఫలంగా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం షర్మిలను ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా నియమిస్తూ జనవరి 16న ఉత్తర్వులు జారీ చేసింది. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే... ఏపీలో అన్నాచెల్లెలు చెరొక పార్టీకి అధ్యక్షులుగా ఉన్నారు. సీఎం జగన్ వైఎస్సార్సీపీ అధినేత కాగా, షర్మిల కాంగ్రెస్ పార్టీ చీఫ్. కాగా, ఈ నెల 21న షర్మిల ప్రమాణస్వీకారోత్సవానికి ఏఐసీసీ కార్యదర్శి మయప్పన్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మాణికం ఠాగూర్ తదితర కాంగ్రెస్ పెద్దలు హాజరుకానున్నారు.

## జగన్ మీ బిడ్డ కాదు..

### రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ గడ్డ



అమరావతి :మరో ఉదయం

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పై విరుచుకు పడ్డారు. గుడివాడలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రా..కదలిరా బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలన(%జూ =బశ్రీవ%) లో జరిగిన అరాచకాలను, జగన్ ప్రభుత్వం పెంచిన పన్నుల వల్ల ప్రజలు ఎదుర్కొన్న బాధలను వివరించారు. జగన్ మీ బిడ్డ కాదు. రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ గడ్డని అన్నారు.రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రభుత్వ జీవోలు బయటకు రాకుండా దాచిపెట్టారని విమర్శించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేసి తీరుతామని అన్నారు. వైసీపీని భూస్థాపితం చేయాల్సిన బాధత్య అందరిపై ఉందని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా దేశానికి మహనీయులను అందించిందని గుర్తు చేశారు. టీడీపీ ఎవరికీ భయపడదని అన్నారు.మరో రెండు నెలలు మాత్రమే వైసీపీ ఉంటుందని, ఆతరువాత కను మరుగవు తుందని వివరించారు. వైఎస్ జగన్ ముఖ్య మంత్రి పదవికి అనర్హుడని విమర్శించారు. బూతులు తిట్టే వారితో జాగ్రత్తగా ఉండాలని పరోక్షంగా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని (%ఖశీఋశ్రీఱ చీఋఱఱ%) ని ఉద్దేశించి వ్యాఖ్యనించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపు అన్‌స్టాపబుల్ అని పేర్కొన్నారు.

## ఇళ్ల పథకంలో వడ్డీరాయితీ జమ

### రియంబర్స్‌మెంట్ కింద రూ.46.9 కోట్లు విడుదల
### బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో జమచేసిన సిఎం జగన్

అమరావతి,జనవరి18(మరో ఉదయం):

3లో



మారో ఉదయం

మార్పు కోసం...
మారో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## అహంకారం చావని బిఆర్ఎస్ నేతలు !

చింతచచ్చినా పులుపు చావలేదన్నది సామెత... ఇది సరిగ్గా బిఆర్ఎస్ నేతలకు వర్తిస్తుంది. అధికారం పోయినా అహంకారం చావలేదు. తెలంగాణను అడ్డంగా దోచుకుని అప్పులకుప్పగా చేసి..ఎన్నో హామీలు గుప్పించి.. గోబెల్స్ ప్రచారాలతో ప్రజలను వంచించిన నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే విమర్శలకు దిగడం చూస్తుంటే వీరిని ఏమనాలో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా వంద రోజులు కూడా కాలేదని ఆగుతున్నామని, లేకపోతే హామీల అమలుపై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడే వాళ్లమని బిఆర్ఎస్ ఎంఎల్ఎ టి.హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి పరాకాష్టగా చూడాలి. అలాగే ఇంకా ప్రజలు కెసిఆర్‌నే సిఎంగా కోరుకుంటున్నారని..కెసిఆర్ సిఎంగా లేకపోవడంతో బాధపడు తున్నారని మరో ఎమ్మెల్యే కెటి రామారావు చేసిన వ్యాఖ్యలు కూడా అధికార అహంకారాన్ని సూచిస్తు న్నాయి. ఈ ఇద్దరు నేతలు గత కొన్ని రోజులుగా చేస్తున్న వ్యాఖ్యలు వారి అహంకారాన్ని పరాకాష్టకు చేర్చాయి. తెలంగాణ ప్రజలు చెమటోడ్చి, ప్రాణాలు అర్పించి తెచ్చిన తెలంగాణలో అధికారం అనుభవించి ఇప్పుడు నీతులు మాట్లాడుతున్న వారి అవినీతిని చీల్చి చెండాడాలి. చరిత్రలో మరోమారు ఇలా అధికారం అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడాలంటే భయపడేలా చేయాలి. నిజానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత తీసుకుంటున్న చర్యలను ప్రజలు స్వాగతిస్తున్నారు. ప్రజలు నిరంకుశ పాలన పీడవిరగడ అయ్యిందన్న భావనలో స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. ముందుగా అనేక అక్రమాలకు బిఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి. అందులో ధరణి అక్రమాలు, మిషన్ భగీరథ దుర్వినియోగం, మిషన్ కాకతీయ దుర్వినియోగం వంటివి ఉన్నాయి. నిన్నిటికి నిన్న ఖాజాగూడలో అక్రమంగా విల్లాల కోసం ప్రభుత్వ భూముల్లో రోడ్డు వేయడం వంటివి వున్నాయి. ఇవికాక నయీం డైరీ, మియాపూర్ భూముల బాగోతం, 111 జీవో రద్దు, ప్రభుత్వ భూముల ఆక్రమ అమ్మకాలు, అక్రమ ఆక్రమణలు, సొంతపార్టీకి కోకాపేటలో భూముల కేటాయింపు, ప్రతి నియోజకవర్గంలో పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులు వంటివన్నీ ఉన్నాయి. అన్నింటికి మించి భూములను అప్పనంగా అమ్మి తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారు. సకాలంలో జీతాలు ఇవ్వలేదు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్‌ను భ్రష్టపట్టించారు. ఇంటర్ పరీక్షల పేపర్ల లీకేజీలతో విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమయ్యారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకానేక అధికార దుర్వినియోగాలు కోకొల్లలు. వీటికి సమాధానం రావాలి. అంతెందుకు జర్నలిస్టులకు భూ కేటాయింపులో సుప్రీం తీర్పును కాలరాచినందుకు నిలదీయవచ్చు. సుప్రీం తీర్పునే ఖాతరు చేయని వారు పాలకులు ఎలా అవుతారో చెప్పాలి. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మరింత అప్రమత్తం కావాలి. బిఆర్ఎస్ అక్రమాలను ఎక్కడికక్కడ నిలదీయాలి. ఈ సమస్యలపై ప్రశ్నలు సిద్ధం చేసుకుని నిలదీయాలి. ఎంపి ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలో అడగాలి. ఎందుకు తెలంగాణను భ్రష్టు పట్టించారో అడగాలి. కొన్ని రోజులైతే బిఆర్ఎస్ నేతలు ఇంట్లో కూర్చున్నా, రండి రండని ప్రజలే బయటకు తీసుకువస్తారని హరీష్ రావు అనడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ప్రజలు అంత వెర్రిబాగుల వారని అనుకుంటున్నారా ఏమో అని అనిపిస్తోంది. కర్నాటక లో ఐదు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారిందని హరీష్ రావు విమర్శించడం అహంకారానికి పరాకాష్ట. అక్కడి సంగతి ఎందుకు ..ఇక్కడి తమ పదేళ్ల అవినీతిపై మాట్లాడితే మంచిది. శ్వేతపత్రాలపై మాట్లాడాలి. విద్యుత్ కొనుగోళ్ల అవినీతిపై మాట్లాడాలి. రైతుబంధు పేరుతో అప్పనంగా దోచిన సంగతిపై మాట్లాడాలి. కర్ణాటక ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలుతుందని ఎవరో హెచ్చరించారని అంటున్న హరీష్ రావు..ఇక్కడ కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ గురించి

మాట్లాడాలి. మన దగ్గర కూడా కాంగ్రెస్ నేతలు గ్యారంటీల చావు వార్త చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని చెప్పడం ద్వారా తమ పార్టీ వారిలో భరోసా నింపవచ్చేమో కానీ ప్రజలను ఇకముందు ఎంతమాత్రం నమ్మించలేరని గుర్తించాలి. తెలంగాణ పేరుతో వంచించిన పాపం ఇంకా భరించాల్సిన అసవరం ప్రజలకు లేదు. ఇంతకాలం అధికారంలో ఉండి కాకమ్మ కథలు చెబుతూ వచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను ఓడించడం ద్వారా ప్రజలు మరోమారు విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయం వచ్చింది. తెలంగాణ సమస్యలకి పరిష్కారం కోసం బిఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాల్సిన సమయం వచ్చింది. అప్పులు ఎవరు కడతారో..ఎలా కడతారో చెప్పాలని నిలదీయాల్సిన అవసరం వచ్చింది. కిషన్ రెడ్డినో, రేవంత్ రెడ్డినో, బండిసంజయ్‌నో విమర్శించి పబ్బం గడుపుకునే రోజులు పోయాయని కెటిఆర్, హరీష్ రావులు గుర్తించాలి. ప్రజలను ఇంకా మాయమాటలతో మోసపుచ్చలేమని గుర్తించాలి. వారివల్ల ఒక్క పనికాదని గత పదేళ్లలో తేలిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడిస్తేనే వాళ్లు చేసిన పాపాలు పూర్తిగా పరిహారం అవుతాయి. గత పదేళ్లలో విభజన సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. వాటిని సాధించడంలో బిఆర్ఎస్ ఎంపిలు కనీస ప్రయత్నం చేయలేదు. అప్పుడే చేయని వారు ఇప్పుడు చేస్తారన్న భరోసా లేదు. ఈ కీలక సమయంలో బిఆర్ఎస్ ఎంపిలు ఢిల్లీలో ఉంటే..తెలంగాణకు మరింత నష్టమని గుర్తించాలి. ఇది పాముకు పాలుపోయడమే అవుతుంది. అందువల్ల బిఆర్ఎస్ పట్ల ప్రజలు జాగరూకతతో ఉండాలి. అప్పుడే తెలంగాణకు మేలు చేకూరుతుంది.

# 30కోట్ల మందిని విమానయనాన్నికి చేరువ చేసే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలో దేశం ముందుకు దూసుకుని పోతున్నదని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. వింగ్స్ ఇండియా 2024 కార్యక్రమంతో ప్రపంచస్థాయిలో దేశ పౌరవిమానయాన ఘనత చాటి చెప్పొచ్చని ఆయన అన్నారు.గురువారం బేగంపేట్ ఏయిర్ పోర్ట్ లో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించే... వింగ్స్ ఇండియా 2024, గ్లోబల్ ఏవియేషన్ సమ్మిట్ ను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..విమానయాన రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని... అత్మనిర్భర్ భారత్ కార్యక్రమం పౌర విమానయాన రంగానికి ఎంతో తోడ్పాటునందిస్తోందన్నారు. గత ఏడాది 15.2కోట్ల మంది ప్రయాణికులు విమానాల్లో ప్రయాణించారని తెలిపారు. 2030 కల్లా 30కోట్ల మందిని విమానయనాన్నికి దగ్గర చెయాలనేది తమ లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలో అత్యధిక ఎయిర్ క్రాఫ్ట్ లను భారత్ కొనుగోలు చేస్తోందని.. మన దగ్గర 57 ప్లయింగ్ ట్రెడ్ ఆర్గనైజేషన్ లు ఉన్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో 10వేల మంది మహిళలకు డ్రోన్లపై శిక్షణ ఇస్తామని సింధియా చెప్పారు. డ్రోన్లకు 80శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. బోయింగ్, ఎయిర్ బస్ నుంచి ప్రపంచస్థాయి విమానాలను పలు సంస్థలు కొనుగోలు చేస్తున్నాయన్నారు. అంతర్జాతీయ విమానాల ప్రదర్శనకు హైదరాబాద్ మరోసారి వేదికైంది. ఆసియాలోనే అతిపెద్ద పౌర విమానయాన ప్రదర్శనా కార్యక్రమం వింగ్స్ ఇండియా 2024 బేగంపేట విమానాశ్రయంలో గురువారం ప్రారంభమైంది. మినిస్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మరియు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ , ఇండియన్ ఇండస్టీ ఆధ్వర్యంలో వింగ్స్ ఇండియా ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి వీకే సింగ్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఏవియేషన్ పరిశ్రమలో అత్యుత్తమమైనవి తమ వినూత్న విమానయాన సాంకేతికత, విమాన యంత్రాలను ప్రదర్శిస్తాయి. దీని థీమ్ 'అమృత్ కాల్‌లో భారతదేశాన్ని ప్రపంచానికి అనుసంధానించడమని.. ఇది భారత పౌర విమానయానానికి వేదిక అంటూ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. పౌర విమానయాన రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, గత రెండేళ్లలో ప్రయాణికుల సంఖ్య 260 మిలియన్‌లు పెరిగిందన్నారు.

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వింగ్స్ ఇండియా కార్యక్రమానికి ఆతిథ్యం ఇస్తున్నందుకు సంతోషంగా ఉందంటూ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, తెలంగాణ దేశంలోనే ఎంతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. హైదరాబాద్ నుంచి అమెరికాకు నేరుగా వారంలో మూడు సార్లు విమాన సౌకర్యం కల్పించాలని జ్యోతిరాదిత్య సింధియాను కోరామని తెలిపారు.

ఃరాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వింగ్స్ ఇండియా కార్యక్రమానికి ఆతిథ్యం ఇస్తున్నందుకు సంతోషంగా ఉందంటూ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, తెలంగాణ దేశంలోనే ఎంతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. హైదరాబాద్ నుంచి అమెరికాకు నేరుగా వారంలో మూడు సార్లు విమాన సౌకర్యం కల్పించాలని జ్యోతిరాదిత్య సింధియాను కోరామని తెలిపారు.

హైద్రాబాద్ మహానగరంలో నాలుగురోజుల పాటు ఇంటర్నేషనల్ వింగ్స్ ఇండియా ఎయిర్ షో జరగనుంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమానం బోయింగ్ 777-9 విమానంతో పాటు అనేక విమానాల ప్రదర్శన జరగనుంది. ప్రదర్శనలో 106 దేశాల నుంచి సుమారు 1500 మంది ప్రతినిధులు హాజరుకానుండగా.. దీనికోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అన్ని రకాల విమానాలు వింగ్స్ ఇండియా ప్రదర్శనలో పాల్గొననున్నాయి. భారత వాయుసేనకు చెందిన సారంగ్ బృందం ఈనెల 18 నుంచి 21 వరకు విన్యాసాలు నిర్వహిస్తుంది. 18న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు, సాయంత్రం 4.15 నుంచి 5, 19న ఉదయం 11 నుంచి 12 వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు, సాయంత్రం 4.15-5 వరకు విన్యాసాలు ఉంటాయి. 20, 21వ తేదీల్లో సందర్శకులను అనుమతిస్తారు. దీని టికెట్ రూ.750గా నిర్ణయించారు. 'బుక్‌మైషో' యాప్ ద్వారా టికెట్లను కొనుగోలు చేయవచ్చు. మూడేళ్లలోపు పిల్లలకు ఉచితం.

మొదటిపేజీ తరువాయి

# గజ్వేల్‌లో కెసిఆర్‌ను ఓడించేందుకు కుట్ర

మొన్నటి ఎన్నికల్లో గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించేందుకు రెండు జాతీయ పార్టీలు కూడబలుక్కుని పని చేశాయని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కులాలు, మతాలు చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారన్నారు. అయినా కూడా ఎంతో అద్భుతంగా పని చేసి కేసీఆర్ గెలుపు కోసం కృషి చేశారన్నారు.ఈ విజయం బీఆర్ఎస్ కార్యకర్తలదేనని అన్నారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నానన్నారు. ఈ విజయం కార్యకర్తలదేనని.. అందరి కష్టమన్నారు. శ్రేణులకు కృతజ్ఞతలు చెప్పేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కృతజ్ఞత సభ గురువారం జరిగింది. కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేతపై 154 నామినేషన్లు వేశారని.. అనేక కుట్రలు.. విత్ డ్రా తర్వాత 47 నామినేషన్లు మిగిలాయన్నారు. నాలుగు మిషన్ల ఏర్పాటుతో కొందరు గందరగోళానికి గురయ్యారన్నారు. కారు గుర్తుకు పడాల్సిన ఓట్లు వేరే గుర్తులకు పడ్డాయన్నారు. ఇన్ని కుట్రలు జరిగినా కేసీఆర్ 45వేల మెజారిటీతో గెలిపించి.. మూడోసారి గెలుపు అందించారన్నారు. గజ్వేల్ ప్రజలందరికీ కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. గజ్వేల్ అభివృద్ధి ఎంతో జరిగిందని.. మొన్న జరిగిన అసెంబ్లీలో గజ్వేల్‌పై అక్కసు కాంగ్రెస్ వెళ్లగక్కిందని విమర్శించారు. కేసీఆర్ ఇక్కడికి వచ్చాక తాగు, సాగునీటి సమస్య లేదన్నారు. కేసులు తగ్గాయని.. కుట్రలు తగ్గాయన్నారు. గత చరిత్రను బీఆర్ఎస్ తిరగరాసిందన్నారు. ఒక్కనాడు కాంగ్రెస్ నాయకులపై కేసుకు పెట్టలేదన్నారు. గజ్వేల్ ఎలా బాగు చేయాలి అని నిరంతరం కేసీఆర్ ఆలోచించారన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి నెల రోజుకు కాలేదని.. బెదిరింపులకు పాల్పడుతూ కేసులు పెడుతున్నారన్నారు. కేసీఆర్ గజ్వేల్‌ను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తే.. కాంగ్రెస్ వాళ్లు కేసులు, కుట్రలతో ముందుకు తీసుకెళు తున్నారన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ అన్నారని.. రూ.4వేలకు ఫించన్లు పెంచుతామన్నారని.. కరెంట్ బిల్లు కట్టొద్దు అన్నారన్నారు. రైతుబంధు పెంచుతాం అన్నారని.. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామనన్నారని.. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పుడు చేతులెత్తేశారన్నారు. ప్రగతి భవన్‌లో 250 గదులున్నాయని.. బంగారు బాత్ రూములు ఉన్నాయని ఆరోపణలు చేశారని.. అక్కడ ఉంటున్న ఉప ముఖ్యమంత్రి భట్టి వాస్తవాలు చెప్పాలన్నారు. బీజేపీతో కొట్లాడతం అని దోస్తీ చేస్తున్నది ఎవరని ప్రశ్నించారు. బండి సంజయ్, అరవింద్, ఈటల రాజేందర్, రఘునందన్‌ను ఓడగొట్టింది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. ఈ దేశం అదానీ, అంబానీల చేతుల్లో ఉందని.. అదానీ అవినీతి వెనుక ప్రధాని ఉన్నారని.. ఈ ఇద్దరి చేతుల్లో 500 కంపెనీలు ఉన్నాయని రాహుల్ గాంధీ అంటున్నారని.. రేవంత్ రెడ్డి, అదానీ కలిసి హగ్‌లు, షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటున్నారన్నారు. ఇందులో రాహుల్ కరెక్టా, రేవంత్ కరెక్టా.. ? అంటూ ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వబోమంటే బీజేపీ కాంగ్రెస్ వాళ్లు ఎందుకు కొట్లాడం లేదని నిలదీశారు. మెడలు వంచుతామని చెప్పిన కాంగ్రెస్ వాళ్లు, బీజేపీ కేంద్రమంత్రుల మెడలో నేడు పూలదండలు వేస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎవరితో కుమ్మక్కయ్యారో తెలంగాణ ప్రజలకు స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు. కేటీఆర్ దావోస్ వెళ్లి పెట్టుబడులు తీసుకువస్తే దండగా అన్నారని.. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అక్కడికి వెళ్లడం వేస్ట్ అన్నారని.. మరి ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి సైతం దావోస్ వెళ్లారని.. దానిపై ఏం సమాధానం చెబుతారని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు.

# టాటా గ్రూపుతో స్కిల్ సెంటర్లపై ఒప్పందం

మొదటిపేజీ తరువాయి

రైతులకు కార్పొరేట్ తరహాలో లాభాలు రావాలన్నదే తన స్వప్నమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో 'ఆహార వ్యవస్థలు, స్థానిక చర్యలు' సదస్సు జరిగింది. ఇందులో రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. భారత్‌లో రైతుల ఆత్మహత్యలు అతిపెద్ద సమస్య అన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు రావు, ఆధునిక టెక్నాలజీ లేదన్నారు. రైతులకు సరైన లాభాలు రావడం లేదని.. తెలంగాణలో మాది రైతు ప్రభుత్వమని చెప్పారు. రైతు భరోసా ద్వారా నేరుగా పెట్టుబడి సాయం అమలు చేస్తున్నామన్నారు. రైతులకు కార్పొరేట్ తరహా లాభాలు రావాలనేదే నా స్వప్నమని.. లాభాలు వస్తే రైతు ఆత్మహత్యలు 99శాతం ఉండదవన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అవసరమని, ఎంతో సాయం చేస్తున్న రైతులకు ప్రపంచం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు స్థిరమైన మోడల్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని.. రైతులు ఎప్పుడూ ప్రపంచానికి సహాయం చేస్తూనే ఉన్నారని.. ఇప్పుడు ప్రపంచం రైతులకు అండగా నిలువాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఇదిలావుంటే

రాష్ట్రంలోని 50 ఐటీఐలలో అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు టాటా గ్రూప్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. వీటిలో కొత్త కోర్సులు, మాస్టర్ ట్రైనర్ల నియామకానికి రూ.1500 కోట్ల పెట్టబడులు పెట్టనుంది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఇప్పటికే వివిధ రంగాల్లో

విస్తరించిన టాటా గ్రూప్ తెలంగాణలో చేపట్టబోయే భవిష్యత్తు వ్యాపార ప్రణాళికలపై చర్చించారు.

టీ రంగంలో టాటా కన్‌స్టలెన్సీ సర్వీసెస్ హైదరాబాద్ లోని అతి పెద్ద ఐటీ కంపెనీలలో ఒకటి.

ఇందులో 80 వేల మందికి పైగా ఉద్యోగులున్నారు. రాబోయే కొన్నేళ్లలో టీసీఎస్ మరింత వృద్ధి చెందనుంది. టాటా అడ్వాన్స్ డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఇప్పటికే గ్లోబల్ డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో పలు ప్రాజెక్టులు చేపట్టింది. బోయింగ్, సికోర్స్ కీ, జిఇ, లాక్‌హీడ్ మార్టిన్ వంటి కంపెనీలతో కలిసి పెట్టుబడులు పెట్టింది. ఃరాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసేందుకు టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ కొత్త ప్రాజెక్టు చేపడుతోంది. లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ కోర్సులతో పాటు నైపుణ్యాల మధ్య అంతరాన్నితగ్గించే బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తుంది. కొత్త కోర్సులకు పెట్టుబడులు పెడుతుంది. టాటా గ్రూప్ కు చెందిన ఎయిర్ ఇండియా విస్తరణలోనూ హైదరాబాద్ ను ట్రాన్సిట్ హబ్ గా ఎంచుకోనుంది. హైదరాబాద్ నుంచి డొమెస్టిక్, ఇంటర్నేషనల్ విమానాల కనెక్టివిటీని పెంచనుంది. తెలంగాణ అభివృద్ధికి టాటా గ్రూప్ కీలకమైన భాగస్వామ్యం అందిస్తోందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. వివిధ రంగాలలో పెట్టబడులు పెడుతున్న టాటా గ్రూప్ నకు తగిన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో అధునాతన నైపుణ్య కేంద్రాల ఏర్పాటుకు టీటీఎల్ బాగస్వామ్యం పంచుకోవటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీలను నెలకొల్పేందుకు చొరవ





చూపాలని సీఎం టాటా గ్రూప్ ను స్వాగతించారు.

మ గ్రూప్ పెట్టుబడులకు తెలంగాణ వ్యూహాత్మకమైన కేంద్రంగా ఉందని, వీలైనంత మేరకు రాష్ట్రంలో

తమ గ్రూప్ వ్యాపారాలను రాష్ట్రంలో విస్తరిస్తామని టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ అన్నారు. కొత్త ప్రభుత్వంతో కలిసి పని చేయాలనే ఆసక్తితో ఎదురు చూస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్యం. ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో ఉదయం

మొదటిపేజీ తరువాయి

# ఇళ్ల పథకంలో వడ్డీరాయితీ జమ

రాష్ట్రంలో 12.77 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు పావలావడ్డీ రుణాలు ఇప్పించామని, ఈ దఫాలో 4.07 లక్షల మందికి వడ్డీ రియింబర్స్ కింద రూ.46.9 కోట్లు విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈకార్యక్రమం జరుగుతుంది. గతంలో సుమారు ఐదు లక్షలకు పైబడి అక్క చెల్లెమ్మలకు రూ.50 కోట్ల పైబడి ఇచ్చాం. రూ.35వేల రుణాలను పావలా వడ్డీకే ఇస్తున్నాం. దేశ చరిత్రలో ఎప్పుడూ కూడా జరగని విధంగా 31,19,000 ఇళ్ల స్థలాలు ఇచ్చాం. అందులో ఇప్పటికే 22లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఒక్కో ఇంటికి 2.7 లక్షలు ఖర్చు అవుతుంది. మౌలిక సదుపాయాలకు మరో రూ.1 లక్ష ఖర్చు అవుతోంది. ఇళ్ల నిర్మాణంకోసం ఉచితంగా ఇసుక ఇస్తున్నాం అని సీఎం జగన్ పేర్కొన్నారు. 'సిమెంటు, స్టీల్, మెటల్ ఫ్రేంలు తదితర ఇంటి సామగ్రి మీద కనీసంగా రూ.40వేలు మంచి జరిగేలా చూస్తున్నాం. ఒక్కో ఇంటి స్థలం విలువ జిల్లాను బట్టి, ప్రాంతాన్ని బట్టి రూ.2.5లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంది. అన్ని కలుపుకుంటే దాదాపు ప్రతి అక్క చెల్లెమ్మకు రూ.5 -20 లక్షల వరకూ ఒక ఆస్తిని ఇవ్వగలిగాం. ఈ అవకాశం దేవుడు నాకు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కేవలం పావలా వడ్డీకే రూ.35వేల చొప్పున రుణాలు ఇప్పిస్తున్నాం. ఈ మంచి కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని సీఎం జగన్ తెలిపారు. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రికార్డు స్థాయిలో నివేశన స్థలాలను పంపిణీ చేయడంతోపాటు ఇళ్లను మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేయడంతో పాటు రాయితీపై సామిమవిగ్రి అందిస్తున్నారు. ఇళ్ల లబ్ధిదారులు బ్యాంకు నుంచి పొందిన రుణాలకు వడ్డీని కూడా రీయింబర్స్‌మెంట్ చేవియవినున్నారు. తొలి విడత లబ్ధిదారులకు వడ్డీని రీయింబర్స్‌మెంట్ చేశారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యవితలు స్వీకరించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 71,811.50 ఎకరాల విస్తీర్ణంలో 31లక్షల ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మల పేరిట పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు చొప్పున ఇవ్వడమే కాకుండా, ఉవిచివితంగా ఇసుక సరఫరా ద్వారా రూ.15 వేలు, సివిమెంట్, స్టీలు, మెటల్ ఫ్రేమ్స్, ఇతర నిర్మాణ సామగ్రిని తక్కువ ధరకే అందించడంతో మరో రూ.వి40 వేల మేర లబ్ధి కల్పిస్తున్నారు. పావలా వడ్డీకే రూ.35వేలు చొప్పున బ్యాంకు రుణం అందిస్తున్నారు. ఇలా మొత్తంగా ఒక్కో లబ్ధిదారుకు రూ.రూ2.70 లక్షలు చొప్పున లబ్ధి చేకూరుస్తున్నారు. దీనికి అదనంగా మరో రూ.లక్షకు పైగా ప్రతి ఇంటిపై మౌలిక వసతులకు ఖర్చు పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతుండగా, ఇప్పటికే 8.6 లక్షలకు పైగా ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించింది. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. బ్యాంకులు 9 నుంచి 11 శాతం వడ్డీవితో రుణాలు ఇస్తున్నాయి. అయినా వారిపై భారం పడకుండా పావలా వడ్డీకే రుణాలు అందిస్తూ ఆపై వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. తొలి దఫా అర్హులైన 4,07,323 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.46.90 కోట్లను గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఇలా సంవత్సరంలో రెండు పర్యాయాలు వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందించనుంది.

# చెట్లు నరికిన వారికి కఠిన చర్యలు తప్పవు

## గ్రీన్ భద్రాద్రి భద్రాచలం

**భద్రాద్రి జిల్లా బ్యూరో జనవరి : 18 మరో ఉదయం**



గ్రీన్ భద్రాద్రి వారు గత 13 సంవత్సరాల నుండి నిరంతరాయంగా మొక్కలు నాటడం, వాటి పర్యవేక్షణ చేస్తూ సంరక్షణ విధిగా భావించి పనిచేస్తుంది. ఆ విధంగా పనిచేయడం ద్వారా ఈ రోజున భద్రాచలంలో ఇంతటి వృక్ష సంపదను నిర్మించుకోగలిగాము. ఇందుకు సహకరించిన గ్రీన్ భద్రాద్రి సభ్యులకు, పర్యావరణ ప్రేమికులకు, భద్రాచలం పట్టణ దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇంతటి మహోన్నత కార్యక్రమం సాధించడం జరిగిందని తెలియజేయడానికి ఎంతో సంతోషిస్తున్నాము. ఈ వృక్ష సంపద ద్వారా మనకు మన భవిష్యత్తు తరానికి చక్కటి వాతావరణాన్ని కల్పించడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించడం, ప్రాణవాయువుని నిరంతరాయంగా అందించడానికి ఈ మొక్కలు అందరికీ ఆధార భూతం. ఇంతటి విశిష్టత కలిగిన మొక్కలను పెంచడం, సంరక్షించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలి. గురువారం ఏ . ఎస్. ఆర్ కాలనీ నందు శేషు అని ఒక వ్యక్తి తన ఇంటి ముందున్న ఒక బాదం మొక్క చెట్టు కొమ్మలను పూర్తిగా తొలగించినాడు.గురువారం ఉదయం 6 గంటలకి ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రీన్ భద్రాద్రి సభ్యులు అక్కడికి వెళ్లి విచారించగా తను, తన తప్పును తెలుసుకొని క్షమాపణ కోరడం జరిగింది. భవిష్యత్తులో తను ఇటువంటి తప్పు మరలా చేయనని బ్రతిమిలాడుకోవడం జరిగింది. అంతట గ్రీన్ భద్రాద్రి సభ్యులు శేషు అనే వ్యక్తితో కొమ్మలు నరికిన బాదం వృక్షానికి చుట్టూ పెద్ద పాదు తీయించి, నీరు పోయించి ప్రతిరోజు ఈ విధంగా చేయవలసిందిగా తనను ఆదేశించడం జరిగింది .ఈ సందర్భంగా భద్రాచల పట్టణ ప్రజలకు , వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా ఎవరైనా ఏ కారణం చేతనైనా మొక్కను నరకడం, కొమ్మలు నరకడం చేసినచో వారు తప్పనిసరిగా చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి ఏ విధంగానూ సంకోసించమని, మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించడం కూడా గ్రీన్ భద్రాద్రి సభ్యులకు తెలుసని కనుక ఎవరు దయచేసి మొక్కలను నరకడం కొమ్మలు నరకడం చేయరాదని ఆ విధంగా చేసిన వారు కచ్చితంగా చట్టపరంగా శిక్షార్హులు అవుతారని గ్రీన్ భద్రాద్రి సభ్యులు తెలియచేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి గౌరవ అధ్యక్షులు డాక్టర్. గొళ్ళ భూపతి రావు, కామిశెట్టి కృష్ణార్జున రావు, గ్రీన్ భద్రాద్రి న్యాయ సలహాదారు పామరాజు తిరుమలరావు పాల్గొన్నారు.

# వ్యాపార నిర్వహణలో జీఎస్టీ నిర్మాణాత్మక పాత్ర

## ఈనెల 23న ఎఫ్టిసిసిఐ, ఐసీఏఐ సంయుక్తంగా నిర్వహణ

## ఐసీఏఐ బ్రాంచ్ వరంగల్ బ్రాంచ్ చైర్మన్ రాయబారపు హరికృష్ణ

**బ్యూరో చీఫ్ వరంగల్ జనవరి 18**

ఆర్థిక వ్యవస్థ యొక్క అధికారికీకరణ, వ్యాపారం మెరుగుదలకొరకు గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ సహా యపడింది. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ వరంగల్ బ్రాంచ్ చైర్మన్ రాయబారపు హరికృష్ణ అన్నా రు. గురువారం హంటర్ రోడ్ లోని వరంగల్ బ్రాంచ్ ఐసిఏఐ కార్యాలయంలో సెమినార్ ఆన్ ద రోల్ ఆఫ్ జీఎస్టీ ఇన్ షేపింగ్ బిజినెస్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ గురించి స్పష్టమైన అవగాహన మంచి నిర్ణయానికి దారితీస్తుం ది. ముఖ్యంగా తయారీ రంగం, సేకరణ, అమ్మకాలు, సేవలు ఇతర రంగాలలో వ్యాపారులకు మెరుగైన అవ కాశాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు ఈ నే పథ్యంలో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కా మర్స్ అండ్ ఇండస్ట్రీ ఎఫ్ టి సి సి ఐ, ఎస్ ఐ ఆర్ సి వరంగల్ శాఖ, ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండ స్ట్రీ డబ్ల్యూ సిసిఐ సంయుక్తంగా ఈనెల 23న ఐసీఏఐ భవన్ లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అటవీ పర్యావర ణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొంటున్న ట్లు ఆయన తెలిపారు. గౌరవ అతిథులుగా టిఆర్ఎస్ కమిషనర్ జీఎస్టి సికింద్రాబాద్ ఆర్కే రామన్ వస్తున్న ట్లు తెలిపారు. ప్రధానంగా ఈ సెమినార్ లో వ్యాపారు లు పాటించడంలో ఉన్న ప్రధాన సవాలను విస్తృతంగా కవర్ చేస్తుంది. ముఖ్యంగా పన్ను చట్టాలలోని సవాళ్లు జీఎస్టీ ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ ద్వారా ఎదురయ్యే సవాల ను జయించడం, సాంకేతిక సమాచారంతో సవాళ్లను అధిగమించడం సెషన్లను



సంబంధిత రంగంలోని నిపు ణులు నిర్వహిస్తారని తెలిపారు. వ్యాపారవేత్తలు ని పుణులు ఆరోగ్యకరమైన సమావేశాన్ని నిర్వహిస్తూ ఎస్ ఎం ఈ విభాగంలో ఉన్న వ్యాపారులు నివృత్తి చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఈ సం దర్భంగా చైర్మన్ రాయబారపు హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే సభ్యులు సెల్ నంబర్ 8008804529లో రిజిస్ట్రేషన్ కోసం వెంకట లక్ష్మీకర్ రెడ్డిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ చైర్మన్ భగవాన్ దాస్ ముండాడ, సెక్రెటరీ సత్యనారాయణ పూజారి, చైర్, జీఎస్టీ అండ్ కస్టమ్స్ కమిటీ మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్, ఎఫ్ టి సి సి ఐ డిప్యూటీ సీఈఓ సుజాత జిల్లా సీనియర్ పాత్రికేయు డు యాంసాని శ్రీనివాస్, పోగుల కుమారస్వామి తది తరులు పాల్గొన్నారు.

# నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి

**భద్రాద్రి జిల్లా బ్యూరో జనవరి: 18 మరో ఉదయం**

అవశేష ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నటసార్వభౌమ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు మణుగూరు మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ సెంటర్, సమితి సింగారం ఏరియాల లో పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి వాసిరెడ్డి చలపతి రావు ఆధ్వర్యం లో ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు యుగపురుషుడని, తెలుగు సినీ వినీలాకాశంలో ఓ సంచలనమని రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంపై ఆయన ప్రభంజనం, ఆయన పేరు తెలుగువాడి ఆత్మగౌరవం ఆయన తీరు రాజకీయ విశ్వరూప, నటుడిగా ప్రజల గుండెల్లో కొలువైన దైవ రూపం, నాయకుడిగా ప్రజాహిత పాలనకు నిలువెత్తు రూపం, రూ. 2 కిలో బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి సంక్షేమ పథకాల సృష్టి కర్త అని కొనియాడారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని నలుదిశలా వ్యాపింపచేసిన మహనీయుడని, ఆయన చూపిన మార్గంలో పయనించి, ఆయన ఆశయ సాధన కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పినపాక నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువద్దమని సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల పార్టీ అధ్యక్షులు దొడ్డి కృష్ణ , సమిత్ సింగారం సర్పంచ్ బచ్చల భారతి, లంక మల్లారం వార్డ్ మెంబర్ కరీమునిషా బేగం, యార్లగడ్డ రాజా, చావా శ్రీదేవి రామారావు, ముసునూరి చంద్రావు, మళ్ళీ డి. లోకేశ్వరరావు, బచ్చల సుమేష్, యలమాటి పూర్ణ, దారపనేని హరి, మానుకొండ రఘురాం పోచం అశోక్, గంట రమేష్ బాబు, చంద్ర మోహన్, బచ్చల సత్యనారాయణ, వెంకటరాజు, పెంట్యాల రాజేష్, తాత సాయి పోచం రాము, బుద్ధరాజు సత్యనారాయణరాజు, తంగేటి రామారావు, ఎస్.కె యాకోబి తదితరులు పాల్గొన్నారు.






# దేవాలయాల స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని ఉద్యమంలా నిర్వహించాలి...మురళిధర్ రావు

**మరో ఉదయం ప్రతినిధి కూకట్పల్లి**

అయోధ్యలో శ్రీరామమందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను శుభ్రం చేయాలని దేశ ప్రజలను భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు జనవరి 22 నాటికి దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, దేవాలయాలను శుభ్రం చేయాలని, స్వచ్ఛతా ప్రచారాన్ని నిర్వహించాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర బిజెపి వ్యవహారాల ఇంచార్జ్ మురలీధర్ రావు పిలుపునిచ్చారు. గురువారం కూకట్పల్లి స్వచభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో అసెంబ్లీ పరిధిలోని కేపిహెచ్బి రోడ్ నెంబర్-3 శివాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మురలీధర్ రావుకి కాంతారావు ఘనస్వాగతం పలికిన బిజెపి శ్రేణులు, స్వచ్ఛ అభియాన్ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పీవీ శ్రీరమణ ఇరువురికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మురళిధర్ రావు మాట్లాడుతూ 500 ఏళ్ల పోరాటం తర్వాత జనవరి 22న రామమందిరాన్ని పునః నిర్మాణం చేసుకోవడం శుభసూచకమని రామజన్మభూమి అయోధ్యలో భవ్య రామమందిర ప్రారంభోత్సవానికి ముందు భారతదేశంలోని అన్ని ఆలయాలు పరిశుభ్రంగా ఉండాలని, మకర సంక్రాంతి నుండి జనవరి 22 వరకు ఈ స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టాలన్న మోదీ గారి దేశప్రజలను కోరారు, మోది గారి పిలుపును కూకట్పల్లి స్వచభారత్ అభియాన్ సంస్థ ఆచరణలో పెట్టడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో స్వచభారత్ అభియాన్ కమిటీ సభ్యులు వినోద్, రవి, సూరిబాబు, ఆర్ఎస్ఎస్, విహెచ్పి సభ్యులు, హిందూ బంధువులు, కాలనీవాసులు, ఆలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు క్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన మహనీయుడు స్వర్గీయ ఎన్టీఆర్ ... ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**మరో ఉదయం ప్రతినిధి శేర్లింగంపల్లి**

తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరమ రావని శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 28 వ వర్ధంతి సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ లో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగరావుతో కలిసి అరికెపూడి గాంధీ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర చిరస్థాయిగా వేసుకున్న నాయకుడు, ప్రజా సంక్షేమమే దేంగా పనిచేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, నాయి నేని చంద్రకాంత్ రావు, కార్తిక్ రావు, రాంచందర్, అల్లం మహేష్, ఆంజనేయులు, రమణారెడ్డి, రాంమోహన్ రావు, మల్లయ్య, హర్ష, కాలనీ వాసులు దేవి నేని ప్రసాద్ , విజయ్ కుమార్, నాని, కుమార్ మరియు నందమూరి అభిమానులు ,శ్రేయభిలాషులు, మిత్రులు ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# కోలుకుంటున్న తమ్మినేని

# ఆస్పత్రిలో పరామర్శించిన భట్టి

**హైదరాబాద్,జనవరి18(మరో ఉదయం):**

హైదరాబాద్ ఏఐజి దవాఖానలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం పరామర్శించారు. గుండెపోటుతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తమ్మినేని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వీరభద్రం సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకొని ప్రజా క్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంట మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ క్యాంపెయిన్ కమిటీ కో కన్వీనర్ అజ్మతుల్లా, తదితరులు ఉన్నారు. కాగా, తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, ప్రాథమికంగా అందిస్తున్న చికిత్సకు ఆయన స్పందిస్తున్నారని ఏఐజీ వైద్యులు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నెల 16న అనారోగ్యంతో ఆయన ఏఐజీలో చేరిన విషయం తెలిసిందే. ప్రత్యేక వైద్యబృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నామని, మరో 24 నుంచి 48 గంటలు అత్యంత కీలకమని, అప్పటివరకు వైద్య బృందం నిరంతరం పర్యవేక్షించడంతో పాటు వెంటిలేషన్‌తో కూడిన

# జిల్లా ఎస్పీ నీ మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తగూడ ఏరియా జిఎం


**భద్రాద్రి జిల్లా బ్యూరో జనవరి: 18 మరో ఉదయం**

గురువారం నూతనంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భముగా బి. రోహిత్ రాజుని వారి ఎస్పీ కార్యాలయం నందు కొత్తగూడెం ఏరియా జిఎం ఎం. షాలెం రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం, శాలువాతో సన్మానించారు.



# తెలుగు జాతి కీర్తిని ప్రపంచం నలుమూలల చాటిన మహనీయుడు నందమూరి తారక రామారావు...

**మరో ఉదయం ప్రతినిధి శేర్లింగంపల్లి**





తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నలు దిశల వ్యాపించేలా చేసిన మహెూన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కాంగ్రెస్ పార్టీ నాయకులు వి జగదీశ్వర్ గౌడ్ బండి రమేష్ లు పేర్కొన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ మరియు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సిర్పూర్ కగజ్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రావి శ్రీనివాస్ లు మియపూర్ డివిజన్ పరిధిలోని మియపూర్ మెట్రో డిపో రోడ్డులోని త్రివేణి సర్కిల్ హుడా మయూరి నగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సాయి బాబా ఆలయం వద్ద ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషకు,తెలుగు వారికి ఓ గుర్తింపు తీసుకొచ్చిన మహానాయకుడు ఎన్టీఆర్ అని, నటుడిగా ప్రస్థానం మొదలుపెట్టి టాప్ హీరోగా తెలుగు సినీ పరిశ్రమను ఏలి అనంతరం ప్రజలకోసం రాజకీయాల్లోకి వచ్చి వారి సమస్యలు తెలుసుకొని సీఎంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిపాలించి ఎంతోమందికి దైవంలా నిలిచారన్నారు. ఆయన మరణించి కొన్ని సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికి ఆయన్ని తలుచుకుంటున్నామంటే ఆయన సాధించిన విజయాలు,చేసిన మంచి పనులు అలాంటివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూన సత్యం గౌడ్, నాగేశ్వరరావు, కావూరి ప్రసాద్, మనెపల్లి సాంబశివరావు, ఇలియస్ షరీఫ్, వీరేందర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, నడిమిట్టి కృష్ణ, బాప్పక యాదగిరి, కొడాలి శ్రీధర్, మయూరి నగర్ అధ్యక్షులు నారాయణ రావు, కావూరి మధు, వాసు, కిషోర్, రాజేంద్ర ప్రసాద్, కిషోర్, అమర్, స్వరూప్, తిరుపతి, గోపాల్, ప్రభాకర్, వెంకన్న, సాయి యాదవ్,వంశీకృష్ణ,రమేష్,రవి కుమర్, శివాజీ,నరేందర్ ముదిరాజ్,పూర్ణ కలపల,ప్రేమ,పరుచూరి వెంకటేశ్వర రావు,సుబ్రహ్మణ్యేశ్వర్ రావు,రాజేష్ దేవినేని,పాలడుగు ప్రసాద్,రాజేష్,వాసు,శ్రీనివాస్,హేమాద్రి

# టి ఎస్ బి సి ఎల్ డిపోలలో పనిచేస్తున్న హమాలీల కష్టానికి తగిన ఫలితం అందే విధంగా కృషి... దామోదర్ గౌడ్

**మరో ఉదయం ప్రతినిధి కూకట్పల్లి**



రాష్ట్రంలో టి ఎస్ బి సి ఎల్ డిపోలలో పనిచేస్తున్న హమాలీల కష్టానికి తగిన ఫలితం అందే విధంగా చర్యలు తీసుకుంటానని తెలంగాణ రాష్ట్ర రెస్టారెంట్ అండ్ బార్ లైసెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ హామీ ఇచ్చారు.టీఎస్ బి సి ఎల్ డిపోలో పనిచేస్తున్న హమాలీలు డిపోలోని స్టాకును వైన్ షాపులకు, బార్లకు మరియు పబ్బులకు సరఫరా చేస్తే ఒక కాటన్ లోడ్ కు అయిదు రూపాయలే ఇస్తూ వచ్చారు. దీనిని ఏడు రూపాయలకు పెంచాలని వారు గత రెండు నెలలుగా డిమాండ్ చేస్తు వచ్చారు.హమాలీల డిమాండ్ కు అనుగుణంగా గురువారం కూకట్ పల్లి సుమిత్ర నగర్ లోని పవన్ బార్ లో తెలంగాణ రాష్ట్ర రెస్టారెంట్ అండ్ బార్ లైసెన్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా హమాలీలతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఒక లోడు సరపరకు ఐదు రూపాయల నుండి ఆరున్నర రూపాయలకు పెంచుతున్నట్లు అసోసియేషన్ సభ్యులు హమాలీలతో ఒప్పంద చేసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ హమాలీలు పగలనకా రాత్రనకా ఎంతో కష్టపడుతున్నారని వారి కష్టానికి గుర్తించి ఒక కాటన్ లోడుకు ఆరున్నర రూపాయలు పెంచడానికి ఈ రోజు ఒప్పందం చేసుకున్నామన్నారు.తదునుగున%శీ%గా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని 8 డిపోలలో బార్లు, రెస్టారెంట్లు పబ్బుల నిర్వాహకులు పెంచిన రేటును ఈ నెల 20 నుండి హమాలీలకు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ ఒప్పందము రెండు సంవత్సరాల వరకు కొనసాగుతుందని, దీని ప్రకారం హమాలీలు డిపో లైసెన్స్ దారులను చాయికి గాని మరే ఇతర అవసరాలకు డబ్బులు అడిగినచో ఈ ఒప్పంద పత్రాన్ని డిపో మేనేజర్స్

# స్వామిగౌడ్, ప్రకాశ్ గౌడ్‌లతో పొన్నం చర్చలు





**కాంగ్రెస్‌లో చేరాలని కోరినట్లు సమాచారం**

**నేరుగా ఇంటికి వెళ్లి చర్చించినట్లు ప్రచారం**

**హైదరాబాద్,జనవరి18 (మరో ఉదయం):**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేరికలపై దృష్టి పెట్టింది. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ను పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ రాజేంద్రనగర్ లో స్వామిగౌడ్ నివాసానికి వెళ్లారు. స్వామిగౌడ్‌తో పాటు కుటుంసభ్యులతో చర్చించారని తెలుస్తోంది. పార్టీలో చేరిక ఆహ్వానంపై స్వామిగౌడ్ ఎలా స్పందించారన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. పొన్నం ప్రభాకర్ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తోనూ చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది.టీఎన్జీవో నాయకుడుగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన స్వామిగౌడ్.. బీఆర్ఎస్ తో తన రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసన మండలికి ఎన్నికయ్యారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత శాసన మండలి తొలి చైర్మన్ గా ఆయనకు కీలక పదవి అప్పగించారు.గతేడాది ఏప్రిల్‌లో శాసనమండలి సభ్యుడిగా, మండలి చైర్మన్‌గా పదవీ కాల పరిమితి పూర్తి చేసుకున్న స్వామిగౌడ్ కొంతకాలంగా టీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాల్లో అంతగా కనిపించట్లేదు. గతంలో గవర్నర్ కోటాలో శాసనమండలికి నామినేట్ అయిన స్వామిగౌడ్ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ స్థానం నుంచి టీఆర్ఎస్ టికెట్ ఆశించారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి పోటీకి ఆసక్తి చూపినా అవకాశం లభించలేదు. ఏదేని ముఖ్యమైన కార్పొరేషన్ పదవి దక్కుతుందని ఆశించినా పార్టీ అధిష్టానం నుంచి స్పందన లేకపోవడంతో స్వామిగౌడ్ అసంతృప్తికి గురయ్యారు. ఈ క్రమంలో 2020లో ఆయన బీఆర్ఎస్ ని వీడి బీజేపీ కండువా కప్పుకున్నారు. అయితే అక్కడ కూడా ఆయన ఉండలేక తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుకున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత స్వామిగౌడ్ తన రాజకీయ భవిష్యత్ గురించి పునరాలోచించారు. పొన్నం ప్రభాకర్ ఆహ్వానంతో కాంగ్రెస్ లోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.రేవంత్ రెడ్డితో స్వామిగౌడ్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

గతంలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రేవంత్ రెడ్డిని పొగిడారు. 'బడుగు, బలహీన వర్గాలకు రేవంత్‌రెడ్డి బలమైన వెన్నుపూస, చేతికర్రగా మారారు. తెల్లబట్టల నేతలకు అమ్ముడుపోవద్దని అంటూ రేవంత్‌రెడ్డిపై ప్రశంసలు కురిపించారు. 'తెలంగాణ ఉద్యమంలో స్వామిగౌడ్ అన్న పాత్ర ఎవరూ కాదనలేనిది. సమైఖ్య పాలనలో ఆయనపై దాడిచేసిన అధికారులకు కీలక బాధ్యతలిచ్చారు. తెలంగాణ బడుగు, బలహీనవర్గాల బిడ్డను గుర్తింపులేకుండా పక్కనపెట్టారు'అని రేవంత్‌రెడ్డి కూడా ప్రశంసించారు. అయితే అప్పట్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. అంతే కాదు..రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా కూడా లేరు. అందుకే కాంగ్రెస్‌లో చేరకుండా బీజేపీలో చేరారు. ఇప్పుడు రేవంత్ కూడా ఆహ్వానించే అవకాశం ఉంది.. ఉద్యమకారులకు గుర్తింపునిస్తామని రేవంత్ చెబుతున్నారు కాబట్టి పార్టీలో చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

## రామప్రతిష్ట సందర్భంగా 22న సెలవు మంజూరు

**న్యూఢిల్లీ,జనవరి18(మరో ఉదయం):**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం గురువారంశుభవార్త అందించింది. అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని జనవరి 22న ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించేందుకు అనుగుణంగా సెలవు మంజూరు చేసింది. ఆ రోజు ఉద్యోగులకు సగం పని దినాన్ని వర్తింపచేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీన్ని ధృవీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమ సన్నాహాల గురించి మంత్రుల వద్ద ఫీడ్‌బ్యాక్ తీసుకున్నట్లు తెలిసింది. మంత్రుల ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి పేదలకు భోజనం పెట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాన్ని పండుగలా జరుపుకోవాలని కోరారు. 22 వ తేదీ తరువాత ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ప్రజలకు అయోధ్యను ఉచితంగా చూపించాలని ప్రధాని సూచించారు. వారితో కలిసి ప్రజాప్రతినిధులు రాములోరిని దర్శించుకోవాలన్నారు. ఇండియా కూటమికి చెందిన నేతలు రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరుకాబోమని ఇదివరకే తెలిపారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బీజేపీ రాజకీయం చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ కార్యక్రమానికి దూరంగా ఉంటామన్నారు.

# కేసులు పెట్టి జైలుకు పంపుతారేమో

## అందుకు సిద్దంగా ఉన్నానన్న గండ్ర

**వరంగల్,జనవరి18(మరో ఉదయం):**

అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతారేమో..అందుకు సిద్ధంగా ఉన్నాననిబీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తారేమో అని, జైలుకు వెళ్లేందుకు సిద్ధం అని అన్నారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన గండ్ర వెంకట రమణ.. పోలీసులు నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఏది చెబితే అది చేయడం సబబు కాదన్నారు. తనపై, తన కుటుంబ సభ్యులపై ఒక రౌడీ షీటర్‌తో ప్రైవేట్ ఫిర్యాదు ఇప్పించి కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. ఆలయం కడితే స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో నోటీసులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులపై హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నామన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్ అండ్ బీ అతిథి గృహం, ఆలయం అన్నీ ఒకే సర్వే నెంబర్‌లో ఉన్నాయని వెంకట రమణారెడ్డి వివరించారు. గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన తనపై కూడా అక్రమ కేసులు బనాయిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గుడిని ఆనుకునే ఆలయ అవసరాల కోసం కాంప్లెక్స్ కట్టామన్నారు. అది ఆలయం ఆస్తి తప్ప తన సొంత ఆస్తి కాదని అన్నారు. 'కేసు నమోదు చేస్తారు.. జైలుకు పంపుతారేమో వెళ్తాను' అని వ్యాఖ్యానించారు. వెంకటరమణా రెడ్డి.

# పార్టీలు మారే చరిత్ర నాకు లేదు

## మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ వెల్లడి

**వరంగల్,జనవరి18(మరో ఉదయం):**

పార్టీలు మారే చరిత్ర నాది కాదని..పార్టీ మారుతున్నట్టు వచ్చే అసత్య ప్రచారాలను నమ్మొద్దని వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హన్మకొండ తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 2012 లో ప్రజారాజ్యం పార్టీ విలీనం తర్వాత ఉద్యమ నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. అప్పడి నుంచి క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా పార్టీకోసం అనేక కార్యక్రమాలు చేశానని పేర్కొన్నారు. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేని కొంతమంది నేను పార్టీ మారుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

÷లిచినా, ఓడినా నిరంతరం జిల్లాలో బీఅర్ఎస్ పార్టీ బలోపేతం కోసం కష్ట పడుదుదామని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగేశ్వర రావు, సునీల్, రజిత,పాక్స్ చైర్మన్స్ వనం రెడ్డి, హరి కృష్ణ, హసన్‌పర్తి మండల పార్టీ అధ్యక్షుడు రజిని కుమార్, పాక్స్ వైస్ చైర్మన్ మల్లా రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, వినోద్, వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇద్దరే నిమినేషన్లు

## ఏకగ్రీవం అయ్యే ఛాన్స్

**హైదరాబాద్,జనవరి18(మరో ఉదయం):**

తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు నామినేషన్ల పర్వం ముగిసింది. రెండు స్థానాల కోసం ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులునుంచి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. ఇక, ఎవరూ నామినేషన్లు వేయకపోవడంతో బల్మూరి వెంకట్, మహేష్ కుమార్ గౌడ్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు. నామినేషన్ దాఖలుకు గురువారం ఆఖరి రోజు కావడంతో కాంగ్రెస్ అభ్యర్థులు మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌లు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇదిలా ఉండగా.. ప్రతిపక్షాల నుంచి ఎవరూ నామినేషన్ వేయలేదు. దీంతో, వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. మరోవైపు.. శుక్రవారం నామినేషన్ల పరిశీలన కొనసాగనుంది. ఈనెల 22వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉంది. అదే రోజున మధ్యాహ్నం మూడు గంటలకు అభ్యర్థుల ఎన్నికపై ప్రకటన వెలువడనుంది.

# అయోధ్య వాతావరణంపై ఐఎండి వెబ్ పేజీ

## నిత్యం ఉష్ణోగ్రతలు తెలిపేలా చర్యలు

**అయోధ్య,జనవరి18(మరో ఉదయం):**

శ్రీరాముని ప్రాణప్రతిష్ట జరిగే ఈ నెల 22న అయోధ్యలో వాతావరణ వివరాలు తెలియజేసేందుకు భారత వాతావరణ శాఖ ఐఎండీ ఏకంగా ఒక ప్రత్యేక వెబ్‌పేజీని ప్రారంభించింది. ప్రాణప్రతిష్ట వేడుక జరిగే 22న అయోధ్యలో అత్యల్ప ఉష్ణోగ్రత 10.7 డిగ్రీల సెల్సియస్, అత్యధిక ఉష్ణోగ్రత 22.2 డిగ్రీల సెల్సియస్‌గా ఉంటుందని ఐఎండీ తెలిపింది. అయోధ్యలో 22వ తేదీన ఉండే ఉష్ణోగ్రతలతో పాటు తేమ, గాలి వేగం తదితర వాతావరణ సంబంధిత అంశాలను కూడా ఐఎండీ ఏర్పాటు చేసిన వెబ్‌పేజీ తెలియజేస్తోంది. 17వ తేదీ నుంచి వారం రోజుల పాటు అయోధ్యలో ఉష్ణోగ్రతల ఫోర్‌క్యాస్ట్‌తో పాటు ఇక్కడ ఈ వారం రోజుల్లో ప్రతి రోజు ఏ సమయంలో సూర్యోదయ, సూర్యాస్తమయా లవుతాయనే వివరాలను కూడా ఐఎండీ పొందుపరిచింది.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com